వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శనివారం, ఆగస్టు 22, 2026



# 31న టీఆర్ఎస్ పాంచజన్య సభ

- బోధన్‌లో సభ పోస్టర్ ఆవిష్కరణ
- పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా జిల్లాకు కల్వకుంట్ల కవిత..
- విజయవంతం చేయాలని పిలుపు
- నిజామాబాద్ సభ పర్యవేక్షకులు, కోరుట్ల ఇంచార్జి డా.రఘు

**బోధన్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఈనెల 31న నిజామాబాద్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న టీఆర్ఎస్ పాంచజన్య సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సభ పర్యవేక్షకులు, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు, రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి పిలుపునిచ్చారు. బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో శనివారం సభకు సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. తెలంగాణ రక్షణ సేన–టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం అనంతరం తొలిసారిగా పార్టీ చీఫ్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్ జిల్లాకు రానున్న నేపథ్యంలో సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ నిజామాబాద్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో జరిగే పాంచజన్య సభలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నిర్దేశించుకున్న ఐదు ప్రధాన లక్ష్యాలను కల్వకుంట్ల కవిత ప్రజలకు వివరిస్తారని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను పల్లెపల్లెకు తీసుకెళ్లేందుకు ఈ సభ ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరిచి పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా జిల్లాకు రానున్న కల్వకుంట్ల కవితకు ఘన స్వాగతం పలికేలా సభను భారీగా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బోధన్‌లో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు రజాక్, ప్రవీణ్ కుమార్, అవంతి కుమార్, లింగంపెల్లి సంజీవ్, రెండ్ల రాజన్న, మేడ్చెల్మల నాని, తెలంగాణ శంకర్, శేఖర్ రాజ్, జాదవ్ రాజ్, రాఘవేందర్ యాదవ్, శంకర్, నిఖిల్ పాల్గొన్నారు.




# హైదరాబాద్ జిల్లా బస్తీ దవాఖానాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టుల దరఖాస్తు గడువు పెంపు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హైదరాబాద్ జిల్లాలోని బస్తీ దవాఖానాల్లో డీఎంఅండ్‌హెచ్‌ఓ హైదరాబాద్ వారి నియంత్రణలో ఎన్‌హెచ్‌ఎం/ఎన్‌యూహెచ్‌ఎం పథకాల కింద మెడికల్ ఆఫీసర్ పోస్టులను తాత్కాలికంగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి సంబంధించిన దరఖాస్తు గడువును పొడిగించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. ఆగస్టు 20 నుంచి ఆగస్టు 22, 2026 వరకు దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. అయితే, ఆగస్టు 22న నాల్గవ శనివారం కావడంతో అన్ని జాతీయాకృత బ్యాంకులకు సెలవు ఉండటం వల్ల కొంతమంది అభ్యర్థులు డిడి పొందలేకపోయినట్లు తెలిపారు.అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు మెడికల్ ఆఫీసర్ పోస్టుల దరఖాస్తు గడువును మరో ఒక రోజు, అంటే ఆగస్టు 24 వరకు పొడిగించినట్లు అధికారులు వెల్లడించారు. దరఖాస్తులు సమర్పించాల్సిన చిరునామా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, 4వ అంతస్తు, జీహెచ్‌ఎంసీ భవనం, పాట్నీ, సికింద్రాబాద్, హైదరాబాద్ లో 24న ఉదయం 11:00 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు సమర్పించాలని పేర్కొన్నారు.

# బెల్ట్ షాపుల నియంత్రణకు గ్రామసభలో వినతి



**మహాదేవపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామపంచాయతీ పరిధిలో అనధికారికంగా వెలుస్తున్న బెల్ట్ షాపుల వల్ల యువత పెడదోవ పడుతోందని, తక్షణమే వీటిని అరికట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన గ్రామసభలో ఈ మేరకు అధికారులకు ప్రత్యేకంగా వినతిపత్రం అందజేశారు. గ్రామంలో మద్యం విచ్చలవిడిగా అందుబాటులోకి రావడంతో యువత చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని, దీనివల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో శాంతిభద్రతలను కాపాడడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై అధికారులు ఉక్కుపాదం మోపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి లేతకరి రాజశేఖర్, లేతకారి రమేష్, రంజిత్ తదితరులు పాల్గొని గ్రామస్థుల తరపున అధికారులకు వినతిపత్రం సమర్పించారు. బెల్ట్ షాపుల నిర్మూలనపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రామప్ప డిఫెన్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి జావలిన్ త్రో పోటీలకు ఎంపిక





**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** హనుమకొండ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో రామప్ప డిఫెన్స్ అండ్ జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కె. రిత్విక జావలిన్ త్రో విభాగంలో జిల్లా స్థాయి ప్రథమ స్థానం సాధించారు. బి.విష్ణుప్రియ జావలిన్ త్రో విభాగంలో జిల్లా స్థాయి ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఎల్.జోష్ణ 600 మీటర్లు మరియు 60 మీటర్ల రన్నింగ్ పోటీలలో జిల్లా స్థాయి ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రామప్ప డిఫెన్స్ అండ్ జూనియర్ కాలేజీ డైరెక్టర్ ఐలీ కర్ణాకర్ గౌడ్ ఘనంగా సత్కరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే జోరు కొనసాగించి మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విజేతలను ప్రధాన కోచ్ కమల్, అకాడమిక్ ప్రిన్సిపల్ వినోద్, వైస్ ప్రిన్సిపల్ తిరుపతి, జోనల్ ఇంచార్జ్ పూర్ణచందర్, అధ్యాపక బృందం, నాన్–టీచింగ్ సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

# విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులే లక్ష్యం

- గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన




**నిజామాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కార్యక్రమానికి హాజరై శంకుస్థాపనలో పాల్గొన్నారు. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు అనుకూలమైన, నాణ్యమైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కళాశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని నాయకులు తెలిపారు. అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు తరగతుల నిర్వహణలో మరింత సౌకర్యం కలగడంతో పాటు విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, నిజామాబాద్ స్థానిక ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కవిత, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.